# హోమగుండం

మిన్నీకి నాలుగేళ్లు. తెల్లని శరీరం. మిలమిల మెరిసే పెద్దకళ్ళు—

మిన్నీ చిరునవ్వు నవ్వినా — బుంగ మూతి పెట్టినా చూడముచ్చటగా వుంటుంది—

తీర్చి దిద్దినట్లున్న ఆ పిల్ల శరీరం ఆరోగ్యాన్ని చిమ్ముతూంటుంది.

కిండర్ గార్టెన్ బళ్ళో ఆర్నెల్ల క్రితం ప్రవేశించిన మిన్నీ, తుప్పున బంతిలా తుళ్ళుతూ ఆడుకునే మిన్నీ, ఆ యింటి వెలుగైన మిన్నీ, అదార్తుగా కళ్ళు మూసింది. రాత్రి పన్నెండైంది.

చాలా బాధపడి ప్రాణం విడిచింది.

'డాక్టర్, నా మిన్నీని బతికించవా?' తండ్రి గోపాల్ డగ్గుత్తికతో అన్నాడు. తల్లి లత నోటంట మాట లేదు. ఆమె మిన్నీ తల దగ్గిర కూచుని వెక్కి వెక్కి యేడుస్తూంది.

డాక్టర్ కార్లో మిన్నీ తల వొళ్ళో పెట్టుకుని లత కూర్చొంది. వెనక స్వంత కార్లో గోపాల్ బైల్దేరేడు. వెనక సీట్లో పనిమనిషి దేవుడమ్మ కూర్చుంది.

ఆస్పత్రి ఆవరణలోకి కార్లు ప్రవేశిస్తూంటే గంట స్థంభం మీద గడియారాలు పావు తక్కువ పన్నెండు చూపిస్తున్నాయి. పది నిముషాల్లో మరో యిద్దరు పెద్ద డాక్టర్లు వచ్చారు. వాళ్ళిద్దరూ గోపాల్ స్నేహితులే.

మిన్నీని వెంటనే ఆపరేషను గదిలోకి తీసుకెళ్ళారు. కాని పాప తిరిగి ప్రాణాలతో బైటికి రాలేదు.

ఆ అర్ధరాత్రి చీకటి అలా శాశ్వతంగా నిల్చిపోయినట్టనిపించింది తల్లి లతకి. గోపాల్ జీవంలేని కూతురు బొందె వేపు చూస్తూ కొయ్యబారి పోయాడు.

'చాలా తీవ్రమయిన 'ఫుడ్‌పాయిజను' వల్ల ఈ పాప పోయింది—'

డాక్టర్లందరూ యేకగ్రీవంగా ప్రకటించారు.

'ఫుడ్ పాయిజన్! అంటే? అంతా ఆ ఆహారమే తిన్నాం. అర్థం కాదు — ' తల వేడెక్కి గోపాల్ అనుకున్నాడు.

'చాలా తీవ్రమయిన విషం అయుండాలి. అసలు ఏ టెస్టులూ చెయ్యలేదు. చాలా వేగం పోయింది. పోస్టుమార్టెమ్ పరీక్షచేస్తే పూర్తి వివరాలు తెలుస్తాయి...' డాక్టర్.

'నో డాక్టర్... అలాంటి వేవీ తలపెట్టకండి - నేను భరించలేను. ఎవాయిడ్ యిట్ - ప్లీజ్...' గోపాల్ ప్రాధేయపడ్డాడు.

డాక్టర్ సానుభూతి ప్రకటించి శవాన్ని తీసుకువెళ్ళమన్నాడు.

తల్లి గుండెలో అగ్నిపర్వతం రగిలింది. ఆవిడ చదువుకున్నది. శ్రీమంతుల యింట్లో పుట్టింది. శ్రీమంతుల యిల్లు మెట్టింది. ఆస్పత్రిలో

అందరి యెదుటా హోరని యేడవలేకపోయింది. గోపాల్‌కి ఆమె పరిస్థితి తెలుసు. నిమ్మళంగా ఆమె దగ్గరకెళ్ళి చెయ్యిపట్టుకోబోయాడు. ఆమె కాస్త దూరంగా జరిగింది.

దేవుడమ్మ శవాన్ని భుజంమీద వేసుకుంటూ జలపాతంలా యేడ్చింది.

ఏమైతేనేం, ఆ యింటి దీపం ఆరిపోయింది.

దీపం ఆరిపోవడానికి పెద్ద కారణం అక్కర్లేదు. రివటగాలిచాలు. కాని యీ చిట్టిదీపం ఆరిపోడానికి పెనుతుఫానే కారణం. మిన్నీ అగ్నిగుండంలోపడి భస్మమైంది.

* * *

మూడు రోజులూ, రాత్రిలూ గడిచేయి. గోపాల్ లత వైపు చూళ్ళేదు. ఆమె అతని దగ్గిరికి రాలేదు. వీళ్ళిద్దరితోటి ఏదైనా చెప్పవలసి వచ్చినపుడు, దేవుడమ్మ తలదించుకుని, తడబడుతూనే చెప్తాంది. రోజులు బరువుగా దొర్లుతున్నాయి.

గోపాల్ ఇంట్లో భోంచెయ్యడంలేదు. లత అసలు భోజనమే చెయ్యడం లేదు. దేవుడమ్మ రెండు మూడుసార్లు కాఫీ తెస్తే విసిరికొట్టింది.

నిజానికి దేవుడమ్మ కూడా తిండి తినడంలేదు. ఇంటికి వెళ్ళడమే లేదు. రెండు మూడుసార్లు ఆమె భర్త జోసెపువచ్చి పిల్చేడు. 'సచ్చినోళ్లతో బతికినోళ్లు సస్తారా - రా యింటికి. అసలు నువ్వే సావాల్సిందే దొంగ...' అని తిట్టేడు.

మరో సమయంలో అయితే దేవుడమ్మ మొగుణ్ణి ఆచి లెంపకాయ కొట్టేది. కాని ఇపుడు కుమిలీ కుంగిపోతూంది. అతనికి జవాబే చెప్పలేదు.

నాలుగో రోజు ప్రసన్న వచ్చేడు. తనూరి కెళ్ళి అదే రావడం. తోవలో దేవుడమ్మ అవుపించి మిన్నీపోయిన సంగతి చెప్పింది. ప్రసన్న నిర్ఘాంతపోయేడు. ప్రసన్న యూనివర్శిటీ లెక్చరరు. యూనివర్శిటీ యేర్పాటుమీద ఇంగ్లాండులో రెండేళ్లు ఉన్నత విద్య అభ్యసించి వచ్చేడు. కాలేజీలో చదువుకుంటున్నప్పుడు అతను, లత అన్నయ్య సహాధ్యాయులు.

ప్రసన్న చాలా నాజూగ్గావుంటాడు. ఉన్నతవిద్య వల్ల అతని మాట తీరులో ఒక 'పాలిష్' కనిపిస్తుంది. అతనిలో చిన్న హాస్య ధోరణి, ముఖ్యంగా స్త్రీలను నవ్వించే హాస్య ధోరణి వుంది. అతను ఇంగ్లీషులో మాట్లాడుతుంటే వినసొంపుగా వుంటుంది.

గోపాల్ ఉద్యోగ రీత్యా ఆ వూరు వచ్చినపుడు ముందుగా అతనికే 'క్లబ్బు'లో ప్రసన్నతో పరిచయమైంది. అతన్ని 'టీ'కి ఇంటికి ఆహ్వానించి నపుడు తమాషా జరిగింది.

'ఇతను నా మిత్రుడు ప్రస...' అంటూ ప్రసన్నని లతకి పరి చయం చెయ్యబోయాడు. కాని లత అతన్ని వారించి 'ఉండండి, నేనే ఇతణ్ణి మీకు పరిచయం చేస్తా' నంది.

'ఆల్ రైట్! మీరిద్దరూ దెబ్బలాడుకోకండి. నేనే మీ ఇద్దర్నీ వొక ర్నొకరికి పరిచయం చేస్తా' ప్రసన్న.

ముగ్గురూ నవ్వుకుంటుంటే మిన్నీ ఆశ్చర్యంగా నిల్చుండిపోయింది.

మిన్నీకి 'అంకుల్ ప్రసన్న' నచ్చాడు. అతని కళ్ళల్లో పిల్లల్నీ, యౌవనంలో వున్న స్త్రీలనీ ఆకర్షించే శక్తివుంది.

'అంకుల్', 'కజిన్' అనే ఇంగ్లీషు పదాలు ఏ మహనీయుడు కని పెట్టాడోగాని, ఆ సమ్మంధం అమ్మ తరపైనా కావచ్చు, అబ్బ తరపైనా

కావచ్చు. ఏ సమ్మంధం లేని వాళ్ళకు కూడా, ఏ సమ్మంధమైనా సరిపోతుంది.

మిన్నీ యెడల 'అంకుల్ ప్రసన్నకి' అత్యంత ప్రేమ. అంచేత ఆ పిల్ల మరణవార్త అతనికి పెద్ద షాకు తగిలించింది.

'మిన్నీ! ఆ! పోవడమే! ఎలా? కారణం?' ప్రసన్న ప్రశ్నల వర్షం కురిపించేడు.

'పోయింది సార్. చుక్కలాంటి పిల్ల. నా దగ్గర వొకటే చేరిక. ఎప్పుడోగాని తండ్రిదగ్గరుండీది కాదు. తల్లి దగ్గర చేరికలేదు. నన్నెందుకు వదలకుండా తిరిగిందో! నేనెందు కంత చనువిచ్చానో! ఈ బాధంతా నాకు రాసి పెట్టేడు దేవుడు —' దేవుడమ్మ కంట నీరు పెట్టింది.

'సరే దేవుడమ్మా. ఎలా పోయింది? జ్వర మొచ్చిందా?

'లేదు సార్. ఏదో పుడ్డుపాయిజేనట.'

'ఆ ... ఫుడ్ పాయిజన్! ఆ రాత్రి ఏం తింది? అందరూ తిన్న ఆహారమే తిందా? లేక అదనంగా ఏమైనా తిందా...?

దేవుడమ్మ తడబడింది. ఏదో జ్ఞాపకం తెచ్చుకో బోయింది. కాని మళ్ళీ సర్దుకుంది.

'అందరూ తిన్నదేనండీ. ప్రత్యేకంగా యేదీ తినలేదు సార్ —.'

'నేను నమ్మలేను ...'

ప్రసన్న తిన్నగా గోపాల్ ఇంటికి వెళ్ళేడు.

'మిన్నీ పోయింది' గోపాల్ నిశ్చలంగా అన్నాడు.

లత ప్రసన్నని చూశ్కేక కళ్ళు దించేసుకుంది. మరుక్షణం అతని భుజం మీద వొరిగిపోయి, హోరని యేడ్చింది.

అతను వెళిపోతుంటె గోపాల్ అతని వేపు ఓరకంటితో తదేకంగా చూస్తున్నాడు.

*         *         *

ఆ ఇంట్లో కొన్ని రోజుల్నించీ వాతావరణం బాగులేదు. ఆపద సమయంలో పులి గాండ్రింపువిన్న గొర్రెల్లా తాత్కాలికంగా అంతా వొకట యేరు.

గోపాల్, ప్రసన్నల మధ్య పెద్ద ఘర్షణ జరిగింది. నిజానికి గొడవంతా గోపాలే చేశాడు. ప్రసన్న లోలోపలే బాధపడ్డాడు.

నెలరోజులై ప్రసన్న వాళ్ళింటికి వెళ్ళడం లేదు. లత అతనికి చాలాసార్లు ఫోను చేసింది. ఆమె యెంత బతిమాలినా వెళ్ళలేదు. ఆమె ప్రతీ ఆహ్వానాన్ని 'సారీ' అని వినయంగా తిరస్కరించాడు.

కాని మిన్నీ అదార్థుగాపోయిందని తెలిసి అతనికింక ఉండబట్టలేదు. వెళ్లి తల్లిదండ్రుల్ని పరామర్శించి వచ్చేడు.

తన స్టడీలో కూచుని అనుకుంటున్నాడు ప్రసన్న.

గోపాల్ పెద్ద ఉద్యోగం చేస్తున్నాడు. కాని అతనిది యెంత సంకుచితబుద్ధి. లత నాకు కొత్తకాదు. నా సహాధ్యాయుడి చెల్లెలు. మేం కాలేజీలో చదువుకొనే రోజుల్లో యెక్కడికెళ్లినా లత మా వెంట వచ్చేది. నిజం.

ఆమె నాతో యెందుకు కలివిడిగా వుండకూడదు? ఆమెకి నా మీద ఆప్యాయతవుంది. అతనూళ్లోలేనప్పుడు నేనువాళ్ళింటికొస్తున్నానని,లతనీ, మిన్నీని పిక్చర్లకి, షికార్లకీ తీసుకెడుతున్నానని తెలిసింది. మిన్నీయే చెప్పింది సంతోషంగా, అమాయకంగా - 'అంకులు, అమ్మ, నేను పిక్చరు కెళ్ళాం, బీచికెళ్లాం, సండే అన్నవరం వెళ్ళాం'. ఆ మాటలు అతనికి చికాకు కలిగించేయి.

లత నావైపు చూసిన ప్రతిచూపునీ, నాతో అన్న ప్రతి మాటనీ అపార్థం చేసుకున్నాడు. సిల్లీ ఫెలో - అతనికి తెలీదు. నేను స్టూడెంటుగా వున్నప్పుడు లత నెన్నోసార్లు కిస్ చేసా. పెద్ద పదవిలో వుండగానేసరా, దానికి తగ్గ విశాల హృదయం కావాలి!

ఆనాడు నాతో అసహ్యకరంగా ప్రవర్తించేడు. లత యెంత వారించినా తన పదవికీ, చదువుకీ తగని మాటలన్నాడు. నిన్ను షూట్ చేస్తానన్నాడు. మీరిద్దరూ యెముకముక్క కోసం కుక్కల్లా యెందుకు కీచులాడుతారని లత యెంత గోలపెట్టినా, ఒళ్లు తెలీక నన్ను 'గెటవుట్' అన్నాడు — ఇడియట్.

నిజం, ఈర్ష్య అతని గుండెల్ని కాల్చింది. అనుమానం పిచ్చివాణ్ని చేసింది. నన్ను చంపుదామన్న వుద్దేశం అప్పుడే కలిగింది. సమయం కోసం యెదురుచూస్తున్నాడు. అందుకే ఆ సాయంత్రం ఫోనుచేసి నన్ను డిన్నరుకి రమ్మన్నాడు,గతం మరచిపోదాం అని నన్ను మభ్యపెట్టబోయేడు. లత చేత కూడా ఫోన్లో మాట్లాడించేడు. కాని నాకా సాయంత్రమే ప్రయాణం తగిలింది. ఎలాగో మనస్సమాధానం చేసుకొని ప్రయాణం ఆపి డిన్నరుకి వెళ్ళవలసింది — కనీసం లత కోసమైనా ఆ విషం నేనే తినవలసింది. బ్రహ్మచారి పోతే యేడ్చేవాడెవడు. ఒకవేళ లత రెండు కన్నీటిచుక్కలు

రాల్చేదేమో. కాని ... కాని ... అమాయకురాలు — పసికందు — అందాలకుప్ప — మిస్నీకి ముట్టింది ఆ విషం భగవాన్ !

అతని తల తిరిగింది. సీసా తీసి గ్లాసులో పోసుకుని నీటుగా ఒక గుక్క మింగేడు. హాలాహలంగా దిగింది. పొలమారి తలమీద యెడం చేత్తో తట్టుకున్నాడు.

*　　　*　　　*

గోపాల్ - డ్రాయింగ్ రూమ్‌లో కూచుని విపరీతంగా తాగుతున్నాడు. సాయంత్రం తొమ్మిదైంది. కిటికీలోంచి తోటలోకి చూస్తున్నాడు. ఉండుండి అతని తలలోకి ఏవేవో ఆలోచనలువచ్చి, నాట్యంచేసి, వొక్కసారి మాయమవుతున్నాయి. ఉండుండి అతని కళ్లు చెమ్మగిల్లుతున్నాయి. మందు పనిచెయ్యడంలేదు.

వరండామీంచి దేవుడమ్మ వెళ్ళిపోతూ అగుపించింది. ఆమెను గదిలోకి పిలిచి తలుపులు యెంతబాదినా - ఏడ్చి మొత్తుకున్నా - చచ్చినా - రాత్రంతా దేవుడమ్మతో గడపాలనిపించింది. కాని వెంటనే విరక్తి కలిగింది.

లత యెందుకు తలుపులు బాదుతుంది. ఎందుకేడుస్తుంది.

తను లేడీస్ క్లబ్బు మెంబర్లతో అరకు వెళ్ళి తిరిగివచ్చిన పుదయం పక్కమీదవున్న జడపిన్ను చూసి మండిపడింది.

'మిస్నీ - ఇది - ఈ జడపిన్ను డాడీ పక్కమీద ఎలా వచ్చింది ?'

'ఈ పిన్ను దేవుడమ్మది...' మిస్నీ.

'నాకు తెలుసు ఎలా వచ్చింది ? దేవుడమ్మ రాత్రి మనింట్లోనే పడుకుందా ?'

'ఏమో నేను పడుకునేవరకూ మనింట్లోనే వుంది. ఇప్పుళ్ళేదా ?'

వెంటనే వచ్చి నా మీద విరుచుకుపడింది. ప్రశ్నలతో, తిట్లతో నన్ను చిత్రవధ చేసింది. దేవుడమ్మని డిస్‌మిస్ చేస్తానంది.

ఆ ఈర్ష్య వోపట్టాన ఆరలేదు. అసలారనే లేదు. ఎందుకు ఈర్ష్య ? తను నన్ను ప్రేమించనేలేదు. తన మనసు ఆ రోగ్ ప్రసన్న మీద వుంది. ఆ మోజు ఈనాటిదికాదు. ఈ మూడు నాలుగేళ్ళూ యెలాగో నుసికింద నిప్పులా అణిగివుంది! ప్రసన్న రాగానే అది తిరిగి పొగరేగి నిగుర్లు చిమ్మి మంటగాలేచింది. దేవుడమ్మ కారణంగా పుట్టిన ఈర్ష్య నా మీద ద్వేషంగా మారింది. ఇది మనిషికాదు రాక్షసి. నన్ను విషంపెట్టి చంపి ప్రసన్నతో లేచి పోదామని పన్నాగం పన్నింది. ఆడది యెంతకైనా తెగిస్తుంది. వాడూ అదీ కూడబలుక్కున్నారు. వ్యభిచారిణికి రంకు మొగుడు చెప్పిందేవేదం.

పోనీ - ఆ విషపదార్థం నేనైనా తిన్నానుకాను. కాని - కాని - ముక్కుపచ్చలారని మిన్ని - నా ప్రాణం - నిష్కారణంగా తల్లి కుతంత్రానికి - ద్వేషాగ్నికీ బలైపోయింది. ఓహ్ ! భగవాన్ !

గోపాల్ టేబిలుమీద రెండు చేతుల్లో తలపెట్టుకొని బాధగా మూలిగేడు. అతనికి మనసులో మిన్నీ అవుపించి 'డాడీ' అని పిల్చినట్లయింది. కట్టతెగిన ప్రవాహంలా ఏడ్చాడు.

*  *  *

లత పక్కగదిలో మంచంమీద బోర్లా పడుకుంది. దేవుడమ్మ వెళుతూ అమ్మా వెళుతున్నా అంది.

లత తలయెత్తి వోరగా చూసింది. ఆమె కళ్లు నిప్పుల్లా వున్నాయి. వెనకాలే వెళ్ళి దేవుడమ్మని కత్తితో పొడవాలనుకుంది. కాని ఆ పని తనకి చేతకాదని తెలుసు. వెల్లకిలా పడుకుని ఆలోచిస్తూంది.

ఇది దేవుడమ్మ కాదు. దెయ్యం ముండ. దీని సంగతి నాకు డ్రైవరు పరదేశి ముందే చెప్పేడు. కాని నేనంతగా పట్టించుకోలేదు. అదే గొప్ప పొరపాటు.

నల్ల శాణాపు రాయిలావున్న దీని బలమైన శరీరానికో అందం ఉంది. ఎర్రజీరలున్న దీని పెద్దకళ్ళలో మగాళ్ళని వళ్ళో వేసుకునే ఆకర్ష ణుంది. ఇది అణకువగా వుండగలదు. రేగిందంటే బూతులు తిడుతుంది. అసలు దీని జాతేవిటి ! దండు లంజ.

ఈ రాక్షసి ఇద్దరు మొగుళ్ళని మారి, మూడోవాడు జోసెఫుని పట్టింది. మొదటివాడు కసాయి దుకాణంలో పనిచేసేవాడు. రెండోవాడు తోళ్ళ సాయిబు. వాళ్ళు దీన్ని పెళ్ళాడలేదు. ఇదే వాళ్ళ నుంచుకుంది. ఇప్పుడు హార్బరు దొర యింట్లో వంటచేసే జోసెఫు నుంచుకుంది. వీళ్ళు కాక దీనికింకా యెందరో ! కారు నల్లని ముండ పాల తెల్లని ఫుల్‌వాయిల్ చీరకడితే దున్నపోతుకూడా రంభలా వుండడాని కవకాశం వుందనిపించేది.

కాని ఇది నాకే యెసరు పెడుతుందని రవంతకూడా అనుమానించ లేదు.

ఆనాడు సాయంత్రం చిన్న ఆచూకీ లభించినా, నా కళ్లు మూసుకు పోయేయి. పనిమీద నేనూళ్ళోకెళ్ళి తిరిగివచ్చినప్పుడాయన బాత్‌రూంలో వున్నారు. ఇది కూడా అందులో దూరింది. ఇద్దరూ గుసగుసలాడుతూ నవ్వుకుంటున్నారు.

'దేవుడమ్మా ! ! ఎక్కడ ?'

'ఇదిగోనండీ - బాత్‌రూంలో టవలు మార్చడానికెళ్ళా—'

అని దొంగ చూపులుచూస్తూ, పైట సర్దుకుంటూ, విసవిస కిచిన్లోకి పరుగెత్తింది.

అయినా మగాళ్ళని నమ్మకూడదన్న సంగతి తెలుసుకోలేకపోయా. ఆ రోజే దీన్ని మెడబట్టి గెంటవలసింది. కాని ఈ పనిముండలు పనిమానే కాక ఇంటివాళ్ళమీద స్కాండల్సు లేవదీస్తారు.

వీళ్ళిద్దరికీ నేను అడ్డుగాతోచేను. ఇద్దరూ కలిసి నామీద విషప్రయోగం చేసి ఆ అడ్డు తొలగించుకుందామనుకున్నారు. కాని - కాని - వీళ్ళ కుతంత్రానికి అశుభం శుభం తెలియని నా బిడ్డ - నా మిన్నీ బలైపోయింది. మిన్నీ - మిన్నీ ఎక్కడున్నావు నా చిట్టితల్లీ— నీ కోసం నా అణువణువూ రంపపుకోత పడుతూందే తల్లీ—

లత తిరిగి బోర్లాపడి, చేతుల్లో మొహంపెట్టుకుని, మంచం అదిరేలా కుదిలి కుదిలి యేడ్చింది.

*　　　*　　　*

దేవుడమ్మ తనయింట్లో పట్టెమంచంమీద కూచుని, బుగ్గమీద చెయ్యేసుకుని, నేలకేసి దిగులుగా చూస్తూంది. మిన్నీ పోయిన దగ్గర్నుంచీ ఆమె మనసు సరిగాలేదు.

మిన్నీ ! నా మీద నీకు కోపం వచ్చిందా ? మరెందుకు నన్ను విడిచి వెళ్ళావు. అసలు నాదగ్గిర యెందుకంత చేరిక చేసేవు ? నేనెందరిళ్ళల్లోనో పనిచేశా. ఎందరి బిడ్డల్నో చేరిదీశా, పిల్లల్లేని గొడ్రాలిని. నాకు పిల్లల తీపిలేదు. కాని నీవంటే నాకెంతో యిది.

అసలీ వుపద్రానికంతటికీ నీ మమ్మీ డాడీలే కారణం. నీ వాకీ నన్ను వెంటాడేడు. వద్దన్నా. చిన్నచిన్న చొరవలుచేస్తే, 'ఏవిటండీ' అని నవ్వేసివూరుకున్నా. పక్కమీద రాలిపోయిన ముండా జడపిన్ను రామ రావణ యుద్ధం రేపింది. ఇంట్లో వాక చిచ్చురేగుతూంటే, దీనికంతటికి నేనే కారణమని పనిమానేస్తానంటే అయ్యగారొప్పుకుంటేనా. అనవసరంగా

అమ్మగారు ఈర్ష్యతో బాధపడుతున్నారు. కాని నీవులేకపోతే ఈ యిల్లు ఆటకట్టయిపోతుందని నన్నుపోనీయలేదు. నా కసలే మానసం ఎక్కువ. చెడి అంటె పెడీ అనిపిస్తా. అమ్మగారు నానాతిట్లు తిడుతూవుంటే- అయ్యగారు నోరునొక్కుతూవుంటే - అన్నీపడ్డా. అమ్మగారు ఒకటి రెండుసార్లు నన్నువేశారు కూడా. కిమ్మనకుండాపడ్డా— ఎందుకు— ఆ భగవంతుడి తోడు. నా మానసం చంపుకుని, ఆ పాట్లన్నీ నీ కోసమేపడ్డా! మిన్నమ్మా- నీమీద మమకారం నన్ను మనిషిగా మార్చింది.

నా కళ్ళకి చాటులేదు. నా మనసు కనిపెట్టని రహస్యం లేదు. మీ అమ్మ, ప్రసన్నబాబు కలిసి నాకు విషం పెట్టదలిచారు.

ఆ విషం నేనుతిన్నా బావుండును. పనికిమాలిన నా బతుకు చెల్లిపోతే ఏం నష్టం. కాని- కాని- ఆ విషం పసిదాన్ని, దేవుడిలాంటిదాన్ని, నిన్ను పొట్టనబెట్టుకుంది. మిన్నమ్మా— ఎక్కడున్నావ్ తల్లీ.

దేవుడమ్మ కంటికీ మంటికీ ఏకధారగా యేడ్చింది.

*　　　*　　　*

సాయంత్రం యేడున్నర. జోసెఫు, దొర ఇంట్లో వంట చేస్తున్నాడు. ఆయా మరియమ్మ వచ్చి కాస్త కాస్త రుచి చూస్తోంది.

'ఒరే యోసేపూ - నీ చేతి వంట మహ కమ్మగా వుంటుందిరా!'

జోసెఫు పీకదాకా తాగున్నాడు. వాడు తాగితేగాని యే పని చేయలేడు. అలా తాగినా వాడికి తెలివి తప్పదు. ధోరణి మాత్రం పుడుతుంది. ఆ ధోరణిలో చాలా విషయాలు చెప్పేస్తాడు.

'నావంటేనే మరియమ్మ! అది తింటే సొరగానికికూడా యెల్లొచ్చు-' మరియమ్మ మీదికి జోగి చొరవ చేయబోయేడు.

మరియమ్మ రవిక, పయిటసర్దుకుని చీదరించుకుంది, 'వోరుండారి దిక్కుమాలోన్నడా. నీకు యాలాపాలానేదు. దొరసానమ్మ సూస్తే నీకు నాకు సెమడాలెగ్గొడద్ది— ఒరే యోసిపో, నీ వంటతో యెవురైనా సొర గాని కెల్లారారి.'

జోసెపు వులిక్కిపడ్డాడు. ఆమ్లెట్టుమడుస్తూ వోసారి అలా నిలబడి పోయేడు. నిమ్మళంగా అన్నాడు నిట్టూరుస్తూ—

'పంపానే డార్లింగూ— కాని ఓ మడిసి కింకో మడిసిని పంపా— మిస్టిక్కయిపోనాది— సారీ...!'

'అదేట్రో...?'

'అచ్చెప్తే నిన్నూ నన్నూ వురికంబం యెక్కిత్తారే డియరూ.'

'నన్నెందుకురా - నువ్వే యెక్కు. అచ్చరే గాని - సంగతి సెప్పరా...' మరియమ్మ దగ్గరగా వచ్చి ముద్దుగా అడిగింది.

'అదెవరే - ఆ దేవుడమ్మ ముండ - ఆ దేవుడమ్మ ముండ - మరి ప్పుడది నా పెళ్ళావా కాదా...'

'ఔన్రా - కాదని యవుడన్నాడు - '

'ఔనా - పన్జేసుకుంటూన్నప్పుడు సరిగుండాలా? అయ్యగారితో తిరుగుతాదా? లంజ! అయినా ఆడికేం రోగవే రంబనాటి పెళ్ళావుండగా దీనిమీద కన్నా. సిత్రెరికీ - ఈ సదూకొన్నోళ్ళూ - పెద్దోళ్ళూ-పైకి మను సులే - కాని అవసరమొత్తే సెత్తకారి నాయాళ్ళవుతారు - సీ సీ!'

'నాకు దైవరు పరదేశన్న సెప్పాడే. ఈ నా పెళ్ళాం ముండ ఆళ్ళ అయ్యగోరితో తిరుగుతోందని - నాకు రోసవొచ్చింది. శాన్నాల్లు సెప్పి సూశా-ఇన్లేదు. సితకామొతకా తన్నా. తంతే యింటికి రాక అక్కడే వుండి

పోయేది, మళ్ళీ తన పోర్సు తగ్గేదాకా. నాకు సాలా రోసవొచ్చింది అయ్యా గోరితో తిరుగుతోందని. అమ్మగోరూ కొట్టారట. అదీ పరదేశన్నే సెప్పేడు. మర్నేను వొకటే దీనై పోయేననుకో-మరి దీన్ని సఫా సెయ్యా లనిపించింది కాని గురి పిట్టకేత్తే, గుండు పక్కనున్న పువ్వుకి తగిలిందే...'

'ఆయాలా యింటో డిన్నరంట రాత్రికిరానంది. పన్లోంచొచ్చేప్పుడు అదేదో దిక్కుమాల్న యిసం కలిపిన పుడ్డింగు తీసుకుని పెరట్లోంచి దాని గదిలో దూరా. నన్నెవరూ సూళ్లే.

'బలే మాంచి పుడ్డింగే - ఇంద, ఇది నువ్వేతిను - ఎవ్వరికీకు - అయ్యగోరి కసలే వొద్దు. అరు తింటే మళ్ళీమళ్ళీ సెయ్యమని సంపుతారు. అని సెల్పులో యిట్టిపోయా.'

'అది తింటే అదే సస్తది. ఆడికెందుకెట్టొద్దన్నానో యెరికదా. రుసిగావున్న పతిది యబిసారి ముండ రంకు మొగుడికెట్టి తీరుద్ది. ఆ రోకు అలాటిది. నీకు తెల్దా' నవ్వేడు.

'ఓరూరుకోరా దొంగ సంవాదిగా' మరియమ్మ కసిరింది.

'సర్లేవే నువ్వా పతిరతవే ... అది సచ్చినా - ఆడు సచ్చినా, మన ప్లాను ఓకే. ఇద్దరూ సస్తే మరీవోకే. గాని - గాని నా పెళ్ళాం ముండ ఆ పిల్లకెట్టీసినాదిగావాల. ఆ పిల్ల దేవుడమ్మ గదిలో అన్నీ తింటాదంట. తల్లితో సెప్పొద్దంటాదట.

'నాను మడికి ముండావోణ్ణి. కచ్చకొద్ది దాని పాణవో, ఆడి పాణవో- నేకపోతే ఆ ఇద్దరి పానాలో తీద్దామని ప్లానేసా, కాని దేవుడికి బుద్దినేదే - పసిదాని పాణాలు తీసాడే - పాపం!' జోసెపు నిట్టూర్చాడు.

పెద్దవాళ్ళ రగిల్చిన యీర్ష్య అనే హోమ గుండంలోపడి మల్లెపువ్వు లాంటి మిన్నీ భస్మమైపోయింది.